
సాక్షి ఒడిశా

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,43,165లు, బంగారం 1గ్రాము 100 మిల్లీగ్రాములు, వెండి 18 గ్రాములు 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రూ.2.55 కోట్లతో మధ్యంతర బడ్జెట్

రాష్ట్ర శాసనసభలో 2024-25 ఆర్థిక సంవత్సరపు మధ్యంతర బడ్జెటు ప్రతిపాదనలను ఆర్థిక శాఖ మంత్రి బిక్రమ్ కేశరి అరూఖ్ గురువారం ప్రవేశపెట్టారు.

- 8లో.



వయో వృద్ధుల తీర్థయాత్ర ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వ వయో వృద్ధ నాగరిక తీర్థయాత్ర యోజన కింద (బీఎస్‌టీవైఫై) 28వ విడత యాత్ర గురువారం ప్రారంభమైంది.

- 8లో.

న్యూస్‌రీల్

రైల్వేలైన్ల నిర్మాణాలు పూర్తి చేయండి



రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌తో బలభద్ర మజ్జి

కొరాపుట్: ప్రతిపాదిత రైల్వే లైన్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నబరంగ్‌పూర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బలభద్ర మజ్జి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. నబరంగ్‌పూర్-జయపూర్, జయపూర్-మల్కన్‌గిరిల మధ్య ఈ నిర్మాణాలు చిరకాల డిమాండ్లుగా ఉన్నాయన్నారు. ఈ నిర్మాణాలకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం జరిగిన విషయం గుర్తు చేశారు. భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని బలభద్ర ఆరోపించారు.

'ఆదివాసీలుగా గుర్తించాలి'



మాట్లాడుతున్న ఎంపీ రమేష్‌చంద్ర మజ్జి

కొరాపుట్: నబరంగ్‌పూర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని దురువా, కొండారెడ్డి జాతులను ఆదివాసీలుగా గుర్తించాలని బీజేడీ పార్టీకి చెందిన నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి కోరారు. ఈ మేరకు పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. చాలా రోజులుగా ఈ జాతుల ప్రజలు గుర్తింపు కోసం పోరాటం చేస్తున్నారని తెలియజేశారు. వారిని చూస్తే దుఃఖం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి గుర్తింపు ఇవ్వడానికి తమ రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదని వెల్లడించారు. అలాగే నబరంగ్‌పూర్-జయపూర్, జయపూర్-మలక్‌న్‌గిరి రైల్వే లైన్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. 2016లో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్మాణాల కోసం ఎంవోయూలు కుదుర్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా మాట్లాడుతూ.. దురువా, దొర జాతులను ఆదివాసీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ రెండు జాతులను కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇది చిరకాల డిమాండ్‌గా గుర్తు చేశారు. మరోవైపు కొరాపుట్, జయపూర్, రాయగడ పట్టణాల్లో బైపాస్ రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

సిమెంట్ లోడు ట్రక్కు బోల్తా

- డ్రైవర్ దుర్మరణం



డొకిరి ఘాట్ రోడ్డులో బోల్తాపడిన ట్రక్కు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్ మార్గంలో డొకిరి ఘాట్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రక్కు డ్రైవర్ దుర్మరణం చెందాడు. గుప్తేశ్వర్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో రాయిపూర్ నుంచి గుప్తేశ్వర్‌కు సిమెంట్ బస్తాలు తీసుకెళ్తున్న ట్రక్కు డొకిరా ఘాట్ వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆ ట్రక్కు డ్రైవర్ దుర్మరణం చెందాడు. ట్రక్కు బ్రేకులు ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ట్రక్కు కింద డ్రైవర్ పడిపోవడంతో సంఘటన స్థలం వద్దే అతడు మరణించాడు. డ్రైవర్ ముఖం చితికిపోవటం వలన అతడిని గుర్తించలేకపోతున్నారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే రామగిరి పోలీసు పంటి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకొని డ్రైవర్ మృతదేహాన్ని ట్రక్కు కింద నుండి బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అయితే రాత్రి అవ్వడంతో ఆటంకం ఏర్పడింది. కట్టర్‌తో ట్రక్కు భాగాలను కట్‌చేసి మృతదేహాన్ని బయటకు తీసినట్లు తెలిసింది.

భాషాభివృద్ధికి ప్రాధాన్యం

- భాషా సదస్సులో ప్రతిపాదనలకు కార్యాచరణ
- రూ.10 కోట్లతో కార్పస్ నిధి
- ప్రతిభావంతులకు మేధాభృతి
- అసెంబ్లీలో మంత్రి అశ్వినీ కుమార్ పాత్రో వెల్లడి



భాషా సదస్సులో ఏర్పాటు చేసిన అక్షర రూపం

భువనేశ్వర్: ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సదస్సులో ఆమోదించిన ప్రతిపాదనల కార్యాచరణకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శ్రీకారం చుట్టారు. ఒడియా భాష విశ్వవ్యాప్తి, సంరక్షణ, ప్రాచుర్యం కోసం అనేక ప్రతిపాదనల కార్యాచరణ ప్రక్రియ ఆరంభమైంది. ఈ దిశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పస్ నిధి ఏర్పాటుకు నిర్ణయించింది. రూ.10 కోట్లతో ఈ నిధిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనల కోసం రాష్ట్ర ప్రభుత్వం పరిశోధన గ్రాంట్ మంజూరు చేస్తుంది. పూరీ జిల్లా సత్యబాదిలో ఉన్న ఒడియా విశ్వవిద్యాలయంలో ఈ నిధి నిర్వహిస్తారు. ఈ విషయాన్ని రాష్ట్ర శాసన సభలో ఒడియా భాష, సాహిత్యం, సాంస్కృతిక శాఖ మంత్రి అశ్వినీ కుమార్ పాత్రో ప్రకటించారు. ముఖ్యమంత్రి 5టీ చొరవ కింద పారదర్శకంగా, సమయానుకూలంగా అనేక ఇతర ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ అమలు చేయనున్నట్లు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ వేదికగా ఒడియా భాషను ప్రోత్సహించడానికి నిపుణులను ఏకతాటిపైకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఈ నేపథ్యంలో ఏటా అంతర్జాతీయ డిజిటల్ ఒడియా సదస్సు నిర్వహించబడుతుందన్నారు.

ఒడియా ఉపాధ్యాయుల నియామకం

ప్రభుత్వం 1,500 ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక ఒడియా ఉపాధ్యాయులను నియమించనుంది. అనంతరం అన్ని ఉన్నత పాఠశాలల్లో ఒడియా భాష బోధన సమయానుకూలంగా ప్రారంభిస్తుంది. పాఠశాలల్లో ఒడియా భాష బోధన కోసం సిలబస్ రివిజన్ కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీ అవసరాన్ని బట్టి సిలబస్‌ను నవీకరించడానికి క్రమపద్ధతిలో సూచనలు ఇస్తుంది. అలాగే ఆధునిక డిజిటల్ కీబోర్డ్, ఫాంట్‌కు లిపి ప్రామాణీకరణ కోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తారు. వాస్తవ కార్యాచరణ కోసం ఈ కమిటీ నిర్ణీత కాల వ్యవధిలో సూచనలను జారీ చేస్తుంది.

వర్సిటీల్లో వారసత్వ నిధి

100 ఏళ్ల దాటిన అన్ని పాఠశాలలు, కళాశాలలకు రెండు దశల్లో సమగ్రంగా రూ.1 కోటి వారసత్వ మంజూరు (హెరిటేజ్ గ్రాంట్) అందించబడుతుంది. ఈ కార్యక్రమం కింద స్వాతంత్ర్యానికి ముందు స్థాపించబడిన విశ్వవిద్యాలయాలకు రూ.2 కోట్లు మంజూరు చేస్తారు. ఈ కార్యాచరణ ఒడియా విద్యలో మన వారసత్వ పరిరక్షణ, ప్రోత్సాహానికి దోహదపడుతుంది.

ఒడియా లెక్సికాన్ కమిటీ

ఒడియా రచనలను భారతదేశం, ప్రపంచంలోని ఇతర భాషల్లోకి అనువదించడానికి అనువాద గ్రాంట్‌తో కూడిన అనువాద విధానాన్ని ప్రభుత్వం విడుదల చేస్తుందని మంత్రి తెలిపారు. దీని కోసం ఒడియా లెక్సికాన్ కమిటీని ఏర్పాటు చేస్తారు. పలు విభాగాల్లో ఒడియా పదాలతో కూడిన నిఘంటువు, పదకోశంగా ఒడియా లెక్సికాన్ పని చేస్తుంది. విజ్ఞాన, సాంకేతిక, వైద్య విద్యారంగాల్లో ఒడియా భాష ప్రోత్సాహానికి మధ్యకాలిక విధానం రూపొందించబడుతుంది. ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను దష్టిలో ఉంచుకుని ఒడియాలో అవసరాలకు అనుగుణంగా నీడ్-బేస్డ్ సంబంధిత ప్రచురణలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను మంజూరు చేస్తుంది. తదుపరి తరంలో ఒడియా భాషను ప్రోత్సహించడానికి నిర్దిష్ట కాలపరిమితిలో కార్యక్రమాలు చేపడతారు. ఈ సంకల్ప సిద్ధి కోసం 100 మంది వర్ధమాన ఒడియా భాష ప్రతిభావంతులను గుర్తించి ఏటా ముఖ్యమంత్రి సత్కరిస్తారు. అలాగే ఒడియా భాషాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక మేధా భృతి ప్రవేశపెడుతుందన్నారు.

ప్రజా గ్రంథాలయాల ఉద్యమం

యువతలో చదివే అలవాటును పెంపొందించేందుకు ప్రజా గ్రంథాలయాల ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఈ కార్యక్రమం కింద ఒడియా గ్రంథాలయాలు ఏర్పాటు చేయడానికి భారతదేశం, విదేశాల్లో ఒడియా సంఘాలకు ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా, రాష్ట్రం వెలుపల ఒడియా భాష ప్రచారంలో స్వచ్ఛందంగా ప్రచారం చేసేందుకు చర్యలు తీసుకుంటారు.

వర్సిటీల్లో ఒడియా పీఠాలు

రాష్ట్రంలో బాల సాహిత్యానికి ప్రోత్సాహం లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మద్దతు, ప్రోత్సాహకాలతో ఈ కార్యాచరణకు వారధిగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. వివిధ విశ్వ విద్యాలయాల్లో ఒడియా పీఠాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తొలి దశలో 5 విశ్వవిద్యాలయాల్లో ఒడియా పీఠం ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అలాగే ఒడిశా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మారిటైమ్, సౌత్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్ సంస్థను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేస్తారు. దీనికోసం రూ.2 కోట్ల వార్షిక గ్రాంట్ మంజూరవుతుంది.

ఒడియా లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్

ఒడిశా వెలుపల నివసిస్తున్న ఒడియా ప్రజల ఒడియా భాష అభ్యాసం కోసం లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎల్‌ఎంఎస్) అభివృద్ధి చేయబడుతుంది. దీంతో రాష్ట్రం లోపల, వెలుపల ఉన్న వారు ఒడియా భాష అభ్యసించడం సులభతరం అవుతుంది. ఎనిమిదో తరగతి స్థాయి వరకు ఒడియా భాషను ఆన్‌లైన్‌లో నేర్చుకోగలుగుతారు. వీరికి సర్టిఫికెట్లు సైతం మంజూరు చేస్తారు. ఈ సదుపాయాలన్నీ ఒడియా వర్చువల్ అకాడమీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

2027 నాటికి మెట్రో ప్రాజెక్ట్ పూర్తి



చీఫ్ సెక్రటరీ ప్రదీప్ అధ్యక్షతన ప్రాజెక్ట్ మానిటరింగ్ కమిటీ సమావేశం

భువనేశ్వర్: భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు 2027 సంవత్సరం డిసెంబర్ నాటికి పూర్తవుతుందని భావిస్తున్నారు. స్థానిక లోక్‌సేవా భవన్‌లో భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించి బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి ప్రాజెక్ట్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఈ విషయం వెల్లడైంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిధుల సమీకరణ, సాంకేతిక వ్యవహారాలు, వివిధ ప్రాంతాల్లో స్టేషన్ల ప్రణాళికలు, ప్లాట్‌ఫారమ్ ఏర్పాట్లు మొదలైన అంశాలపై చర్చించారు. రానున్న 6 నుంచి 8 నెలల్లో పథకం ప్రణాళిక ప్రకారం భూసేకరణ, నిర్మాణ ఏర్పాట్లు, సివిల్ పనులు, వివిధ అనుబంధ కార్యకలాపాలు, పునరావాసం మొదలైన వాటికి సంబంధించి టెండరింగ్ ప్రక్రియ చేపడతారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ ఏడాది జనవరి నెలలో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) టర్న్-కీ కన్సల్టెంట్‌గా భువనేశ్వర్ మెట్రో రైలు కార్పొరేషన్‌తో ఈ ప్రాజెక్టును అమలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కటక్ త్రిశూలియా వరకు మెట్రో రైలు నిర్మాణం చేపడతారు. రాష్ట్ర అభివృద్ధి కమిషనర్, అదనపు ప్రధాన కార్యదర్శి అనుగర్గ్, గృహ నిర్మాణం నగర అభివృద్ధి విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి జి.మత్తివత్తనన్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి విశాల్ కుమార్ దేవ్, వాణిజ్యం, రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి మనోజ్ కుమార్ మిశ్రా (రైల్వే కార్పొరేషన్), కమిటీ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశానికి ముందు భువనేశ్వర్ మెట్రో రైల్ కార్పొరేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల 2వ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశ స్థితిని పరిశీలించారు. ప్రాజెక్టు కార్యాచరణ ప్రణాళికతో వివిధ నిర్వహణ అంశాలపై చర్చించారు.

సీనియర్ సిటిజన్లను గౌరవించాలి



మాట్లాడుతున్న ఎస్పీ హరీష్



కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్లు

- ఎస్పీ హరీష్ బీసీ

రాయగడ: సమాజానికి ఎన్నో సేవలందించిన సీనియర్ సిటిజన్లను ప్రతి ఒక్కరూ గౌరవించాలని జిల్లా ఎస్పీ హరీష్ బీసీ సూచించారు. స్థానిక గాయత్రీ నగర్‌లో ఉన్నటువంటి సీనియర్ సిటిజన్ల కార్యాలయంలో సంఘం 14వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలియజేశారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆనందవంతమైన జీవితాన్ని అనుభవించాలని ఆకాంక్షించారు. తమ హక్కుల కోసం సమైక్యంగా పోరాడాలన్నారు. సంఘం అధ్యక్షుడు బినోద్ చంద్ర పండ, ఉపాధ్యక్షుడు బలరాం చౌదరిలు సంఘం ద్వారా నిర్వహిస్తున్న వివిధ సంక్షేమ, సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం ముఖ్య అతిథి హరీష్ చేతులమీదుగా పేదలకు చీరల పంపిణీ చేశారు.

రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- రాష్ట్రంలో 3 స్థానాలకు ఎన్నిక

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక జరగాల్సి ఉంది. ఈ మేరకు గురువారం అధికారిక నోటిఫికేషన్ విడుదలైంది. కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, ప్రశాంత్ నందా, అమర్ పట్నాయక్ ఒడిశా నుంచి ఎగువ సభ సభ్యులుగా ఏప్రిల్‌లో పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఈ 3 స్థానాలు ఖాళీ ఏర్పడడంతో ఎన్నిక జరుగుతుంది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఈనెల 27 ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. పోటీ నామినేషన్ దాఖలుకు చివరి తేదీ ఫిబ్రవరి 15గా ప్రకటించారు. పోటీ నుంచి వైదొలిగేందుకు ఉపసంహరణ గడువు ఫిబ్రవరి 20తో ముగుస్తుంది. ఈనెల 16న నామినేషన్ల పరిశీలన, పోటీకి ఖరారైన అభ్యర్థుల పేర్లు వెల్లడిస్తారు. బిజూ జనతాదళ్, భారతీయ జనతా పార్టీల మధ్య లోపాయికారీ అవగాహన ఆరోపణల మధ్య రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు రాజ్యసభ ఎన్నికలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. 2019 సంవత్సరంలో రాజ్యసభ ఉప ఎన్నికలకు బీజేపీ అభ్యర్థిగా నామినేట్ చేసిన మాజీ బ్యూరోక్రాట్ వైష్ణవ్‌కు ప్రాంతీయ పార్టీ బీజేడీ విజయాన్ని అందించింది. నామమాత్రంగా 23 మంది ఎమ్మెల్యేలతో పూర్తి బలం లేకున్నా భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా అశ్విని వైష్ణవ్ బిజూ జనతా దళ్ అండతో విజయం సాధించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి పొత్తుకు అవకాశం లేనట్లు సమాచారం.

114 మంది సభ్యులతో బీజేడీ

రాష్ట్ర శాసనసభలో 114 మంది సభ్యులతో బిజూ జనతా దళ్ ఏకైక బలమైన పార్టీగా కొనసాగుతోంది. ఈ లెక్కన తాజాగా జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో 3 స్థానాల్ని కైవసం చేసుకునే సత్తా అధికార బీజేడీకి ఉందన్న విషయం సుస్పష్టం. మరోవైపు మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కేంద్ర విద్యాశాఖ మంత్రి, రాష్ట్రానికి చెందిన బీజేపీ నాయకుడు ధర్మేంద్ర ప్రధాన్ పదవీకాలం కూడా ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగియనుంది. ఇరుగు పొరుగు రాష్ట్రాల మద్దతుతో రాష్ట్రం నుంచి ఇద్దరు రాజ్యసభ సభ్యులు కేంద్ర మంత్రి మండలిలో కీలకమైన పదవుల్లో కొనసాగారు. అయితే లోక్‌సభలో రాష్ట్ర ప్రాతినిధ్యం బలపరచుకునేందుకు భారతీయ జనతా పార్టీ పలు విధాలా కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో రాజ్యసభలో పూర్తి కాలం కొనసాగిన ఇరువురి ప్రముఖ నేతలను త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దించేందుకు భారతీయ జనతా పార్టీ యోచిస్తోంది. రాజ్యసభ పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న అశ్విని వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్ ఈసారి రాష్ట్రం నుంచి లోక్‌సభ స్థానాలకు పోటీ చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాజ్యసభకు జరగనున్న ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను బరిలోకి దించే విషయం స్పష్టం కాలేదు. బీజేడీ, బీజేపీ ఉభయవర్గాలు లబ్ధి పొందే రీతిలో రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితిని వ్యూహాత్మకంగా మలచుకుని త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ బలాలను మెరుగుపరచుకునే యోచనతో పావులు కదులుతున్నట్లు సంకేతాలు లభిస్తున్నాయి. ప్రత్యక్షంగా బీజేడీ, బీజేపీ కూటమి తెరపైకి రాకుండా పరోక్షంగా ఇరువర్గాలకు ఉపకరించే రీతిలో అభ్యర్థులను బరిలోకి దింపడంలో సరికొత్త విశ్లేషణ బీజేడీ, బీజేపీ రాజకీయ విశ్లేషకుల స్థాయిలో పదునైన కసరత్తు కొనసాగుతోంది.

గుణుపూర్‌లో మినీ మారథాన్



మినీ మారథాన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

రాయగడ: వంశధార వసంతోత్సవాలను పురస్కరించుకుని జిల్లాలోని గుణుపూర్‌లో మినీ మారథాన్‌ను గురువారం నిర్వహించారు. గుణుపూర్ కళాశాల నుంచి ప్రారంభమైన రేస్ పాత బస్టాండ్ వరకు కొనసాగింది. కార్యక్రమాన్ని నిర్వాహకులు ఉమా పట్నాయక్, బాబా ప్రసాద్‌లు జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గుర్తు తెలియని జంట మృతదేహాలు లభ్యం



నది ఒడ్డున ఉన్న మృతదేహాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి కుమార్‌గూడ గ్రామ సమీపంలోని శబరీ నది ఒడ్డున గుర్తు తెలియని యువతీ, యువకుడి మృతదేహాలు స్థానికులు గురువారం గుర్తించారు. ఉదయం చేపల వేట కోసం వెళ్లిన మత్స్యకారులకు ఈ మృతదేహాలు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలు పరిశీలిస్తే ఆత్మహత్య చేసుకున్నట్లు ఉన్నాయని, ఈ ప్రాంతంలో వారిని ఎప్పుడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు మృతదేహాలను కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బంధువులు ఎవరైనా వస్తే మృతదేహాలు అప్పగిస్తామని వెల్లడించారు. ఈ కుమార్‌గూడ ప్రాంతం ఛత్తీస్‌గఢ్‌కు ఆనుకొని ఉండడంతో ఆ రాష్ట్రానికి చెందినవారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రాయగడ: స్థానిక ఉత్కళ గౌరవ్ మధుసూదన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(యుజీఎంఐటీ) ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 76 యూనిట్ల రక్తం సేకరించారు. విద్యార్థుల్లో సేవాభావం కలిగేలా ఇటువంటి తరహా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని యుజీఎంఐటీ ప్రిన్సిపాల్ ఇన్‌చార్జి సరోజ్ కుమార్ సాహు తెలియజేశారు. ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ అధికారి గౌతం పట్నాయక్ పర్యవేక్షణలో రక్తం సేకరణ కార్యక్రమం జరిగింది.

భారీగా గంజాయి స్వాధీనం



బరంపురం: స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

జయపురం: బొయిపరిగుడ పోలీసులు 420 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ వెల్లడించారు. అరెస్టైన వ్యక్తులు సుందరఘడ్ జిల్లా రూర్కెలాకు చెందిన రోడర్ బిశాల్ సింగ్(24), వికాశ్ దాస్(23)లుగా నిర్ధారించారు. వివరాల్లోకి వెళ్తే.. బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి మంత్రిఅంబ ప్రాంతంలో పెట్రోలింగ్ జరుపుతుండగా ఒక వ్యాన్ అతివేగంగా వస్తుండగా చూసి ఆపేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయితే వ్యాన్ ఆగకుండా ముందుకు వెళ్లడంతో పోలీసులు దానిని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం వ్యాన్‌ను తనిఖీ చేయగా 12 బస్తాల్లో గంజాయి బయటపడింది. దీంతో గంజాయి, వ్యాన్‌ను సీజ్‌చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. మెజిస్ట్రేట్ సమక్షంలో గంజాయి తూయించగా 420 కేజీల 540 గ్రాములు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బరంపురం: కొందమాల్ జిల్లా బల్లిగుడా సరిహద్దుల్లో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి బాబు శంకర్ సాహు తెలిపిన వివరాల మేరకు.. బల్లిగుడా నుంచి వ్యాన్‌లో అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో బుదనాడ జంక్షన్‌లో వ్యాన్‌పై పోలీసులు దాడిచేసి 81 కిలోల గంజాయిని సీజ్ చేశారు. అయితే నిందితులు మాత్రం ఆటో వదిలి పరారైనట్లు వెల్లడించారు.



జయపురం: అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

1,790 కిలోల గంజాయి ధ్వంసం

బరంపురం: ఒడిశా హై కోర్టు ఆదేశంతో కొద్ది రోజులుగా నేరస్తుల నుంచి గంజాం పోలీసులు స్వాధీనం చేసుకున్న 1,790 కిలోల గంజాయిని గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీన ఆధ్వర్యంలో నష్టపరిచారు. అస్కా, సెరగడ, పట్టపూర్ పోలీసు స్టేషన్ల పరిధిల్లో సీజ్‌చేసిన గంజాయిని బుధవారం ధ్వంసం చేశారు. కార్యక్రమంలో అస్కా పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారి ప్రశాంత్ కుమార్ సాహు, సెరగడ పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారి మనోజ్ కుమార్ సాహు, పట్టపూర్ పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారి సబ్యసాచి మల్లి పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: గంజాయితో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి గుమాక గ్రామం వద్ద కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బంది తో కలిసి బుధవారం పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక ఆటోలో గంజాయి రవాణా చేస్తున్న మందుస్తు సమాచారం వచ్చింది. దీంతో వాహనాల తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా అతివేగంగా వస్తున్న ఒక ఆటోని ఆపి తనిఖీలు నిర్వహించగా, మూడు బస్తాల్లో గంజాయి బయటపడింది. దీంతో గంజాయి స్వాధీనం చేసుకొని, ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేశారు. గంజాయిని తూకం వేయగా 60 కిలోలు ఉంది. దీని విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

భువనేశ్వర్‌కు మహిళా క్రికెట్ జట్టు పయనం



బరంపురం రైల్వేస్టేషన్‌లో మహిళా క్రికెటర్లు

బరంపురం: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు గంజాం జిల్లా మహిళల జట్టు గురువారం పయనమయ్యింది. గంజాం జిల్లాలో జిల్లా పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన బ్లాక్‌స్థాయి పోటీల్లో సత్తాచాటిన వారిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించినట్లు టీమ్ కోచ్ అశోక్ కుమార్ సాహు తెలియజేశారు. వీరు బరంపురం రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరారు.

ఇటుకల ట్రాక్టరు బోల్తా

పర్లాకిమిడి: రాయఘడ రోడ్డు పెగ్గడ గ్రామం వద్ద ఒక సిమెంట్ ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడిన ఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడడంతో పర్లాకిమిడి మెడికల్‌కు తరలించారు. రాయఘడ పోలీసులు కేసు నమోదు చేశారు.

మల్కన్‌గిరి కలెక్టర్‌గా దుర్యోధన్



నూతన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లా నూతన కలెక్టర్‌గా దుర్యోధన్ బోయి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

సమష్టి కృషితో విజయం తథ్యం



మాట్లాడుతున్న కన్ను చరణ్‌పతి

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమష్టిగా కృషి చేస్తే విజయం తథ్యమని బీజేపీ నగర నాయకుడు కన్నుచరణ్ పతి అన్నారు. స్థానిక గాంధీనగర్ మెయిన్ రోడ్డులోని జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లాస్థాయి బీజేపీ నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు పార్టీ నాయకులంతా కృషి చేయాలని కోరారు. ప్రతీ బ్లాక్‌లో కొత్త సభ్యులను చేర్చుకోవడమే కాకుండా, విరివిగా సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో కార్యదర్శి మదన్ మోహన్ పాత్రో, సునీల్ సాహు, కైలాస్ సడంగి పాల్గొన్నారు.

కన్నతండ్రి అకృత్యం

శ్రీకాకుళం రూరల్: కూతురుని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రి ఆ బిడ్డ పాలిట మృగాడిగా మారాడు. కన్న కూతురిపైనే లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఎలా చెప్పుకోవాలో, ఎవరికి చెప్పుకోవాలో తెలీక నరకం చూసిన ఆ అమ్మాయి తల్లి సాయంతో పోలీసులను ఆశ్రయించింది. శ్రీకాకుళంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. నగరంలోని ఓ కాలనీలో నివాసం ఉంటూ ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె చిన్నప్పుడే చనిపోగా చిన్నమ్మాయి 8వ తరగతి చదువుతోంది. గత నెలలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఆ గొడవ జరిగిన రోజు తండ్రి కూతురిపై అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో అదేరోజు రాత్రి తల్లీకూతుళ్లు తమ బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. మూడు రోజుల కిందట తల్లీకూతుళ్లు స్థానిక దిశ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అతనిపై ఫిర్యాదు చేశారు. బాలిక జనవరిలో రజస్వల అయిన నాటి నుంచి ఈ అకృత్యాలు జరుగుతున్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. భయంతో తాను ఎవరికీ ఏమీ చెప్పలేకపోయానని బాలిక పోలీసులకు చెప్పింది. ప్రైవేటు భాగాలను పట్టుకోవడం, రాత్రిళ్లు వికృతంగా ప్రవర్తించడం చేసేవాడని తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందుతుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

రూ.2.55 కోట్లతో మధ్యంతర బడ్జెట్

- యువత, వ్యవసాయంపై దృష్టి
- గత బడ్జెట్ కంటే 11 శాతం ఎక్కువ
- బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి అరూఖ్



బడ్జెట్ ప్రవేశపెడుతున్న మంత్రి బిక్రమ కేశరి అరూఖ్

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో 2024-25 ఆర్థిక సంవత్సరపు మధ్యంతర బడ్జెటు ప్రతిపాదనలను ఆర్థిక శాఖ మంత్రి బిక్రమ్ కేశరి అరూఖ్ గురువారం ప్రవేశపెట్టారు. 2024-25 సంవత్సరానికి రూ.2.55 లక్షల కోట్ల పరిమాణంతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కొత్త ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలలకు రూ.1.18 లక్షల కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ గ్రాంట్‌తో ప్రతిపాదనలు తీసుకురావడం విశేషం. ఈ బడ్జెటులో యువత, వ్యవసాయం మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించారు. సమగ్ర వ్యయ ప్రణాళిక గత సంవత్సరం బడ్జెట్ కంటే దాదాపు 11 శాతం ఎక్కువ. ఇది నవీన్ పట్నాయక్ 5వ విడత పాలనలో చివరి బడ్జెట్. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు నెలల పాటు ఇప్పటికే కొనసాగుతున్న పథకాలు, ప్రాజెక్టులపై ఖర్చు చేయడానికి వీలుగా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను సమర్పించింది.

ఆర్థిక వ్యవస్థ బలోపేతం

బడ్జెట్ సందర్భంగా మంత్రి అరూఖ్ మాట్లాడుతూ.. ఒడిశా 100 మిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా బలోపేతమైందని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం 7.25 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందన్నారు. ఇది జాతీయ సగటు కంటే 1 శాతం ఎక్కువ. రాష్ట్ర తలసరి ఆదాయం మరియు జాతీయ తలసరి ఆదాయం మధ్య అంతరం కూడా 32 శాతం నుంచి 13 శాతానికి తగ్గిందన్నారు. 2024-25 ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రం 8.5 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యాశాఖకు అత్యధిక కేటాయింపులు

రూ.24,764 కోట్లతో పాఠశాల, విద్యాశాఖకు అత్యధిక వనరుల కేటాయింపులు ప్రతిపాదించగా, రోడ్లు, వంతెనలు, విమానాశ్రయాలు, రైల్వేల అభివృద్ధికి రూ.21,000 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రసంగంలో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.1,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇది కాకుండా రాష్ట్రంలోని ఇతర రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.700 కోట్లు కేటాయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 28,944 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌లో 17 శాతం పెంపుదలని ప్రతిపాదించారు. వరి సేకరణ, ఏక విడత నిధుల పంపిణీ కోసం రూ.2,000 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. రూ.3,389 కోట్ల ప్రతిపాదిత వ్యయంతో వచ్చే 5 సంవత్సరాల్లో మొత్తం 858 ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు రూపాంతరం చెందుతాయన్నారు.

భాషాభివృద్ధికి రూ.220 కోట్లు

మధ్యంతర బడ్జెటులో ఒడియా భాషాభివృద్ధి, సంస్కృతి, వారసత్వ ప్రచారం కోసం రూ. 220 కోట్లు ప్రతిపాదించారు. రాష్ట్ర సంగ్రహాలయం. పరిశోధనకు రూ.12 కోట్లు, సాంస్కృతిక విభాగానికి రూ.69 కోట్లు, స్మారక చిహ్నాలు, బౌద్ధ వారసత్వం పరిరక్షణకు రూ.15 కోట్లు, ముఖ్యమంత్రి కళాకార సహాయ యోజనకు రూ.72 కోట్లు కేటాయించారు.

వారసత్వ ప్రదేశాల అభివృద్ధి

వారసత్వ, స్మారక చిహ్నాలు, టూరిస్ట్ డెస్టినేషన్ ఇంటిగ్రేటెడ్ డవలప్‌మెంట్‌కు రూ.350 కోట్లు కేటాయించారు. వారసత్వ పట్టణం పూరీ అభివృద్ధికి ఒబొధా పథకం కింద రూ.431 కోట్లు, సమలేశ్వరి దేవాలయం ఏరియా మేనేజ్‌మెంట్ అండ్ లోకల్ ఎకనామిక్ ఇనిషియేటివ్ (సమలై) కింద రూ.50 కోట్లు, ఏకామ్ర ప్రణాళిక కోసం రూ. 50 కోట్లు బడ్జెటులో ప్రతిపాదించారు.

హరిత బడ్జెట్‌కు చొరవ



హరిత బడ్జెట్ చొరవలో రాష్ట్రం అగ్రగామిగా కొనసాగుతోంది. మధ్యంతర బడ్జెట్ పురస్కరించుకుని పెన్ డ్రైవ్ ద్వారా కొత్త బడ్జెట్ కాపీని ఆర్థిక శాఖ మంత్రి బిక్రమ కేశరి అరూఖ్ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్తిస్థాయిలో ఈ-బడ్జెటింగ్‌ను అవలంబిస్తున్న అగ్రగామి రాష్ట్రాల్లో ఒడిశా ఒకటి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర మధ్యంతర బడ్జెట్‌ని ఆర్థిక మంత్రి బిక్రమ్ కేశరీ అరూఖ్ సభలో ట్యాబ్ ద్వారా సమర్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. బడ్జెటు సమగ్ర సమాచారం, వివరాలు పౌరులకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఘనంగా గిరిజనోత్సవాలు



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అడ్మార్వా

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని మాల్యవంత్ క్రీడా మైదానంలో ఘనంగా గిరిజనోత్సవాలు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా గిరిజన ప్రత్యేక అభివృద్ధి మండలి అధ్యక్షుడు అడ్మార్వా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వెనకబడిన కులాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తెలియజేయడమే ఉత్సవాల ఉద్దేశమన్నారు. గిరిజన యువత అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రదర్శించిన గిరిజన సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్, మల్కన్‌గిరి జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారి టంగులు, మల్కన్‌గిరి సమితి అధికారి పూర్ణిమ దురుక, మల్కన్‌గిరి పౌర సంబంధాల శాఖ అధికారి ప్రమిళా మాఝి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

ప్రముఖ రచయిత 'శ్రీపతి' మరణం తీరని లోటు

శ్రీకాకుళం కల్చరల్, కవిటి: విరసం తొలితరం నాయకుడు ప్రముఖ రచయిత శ్రీపతి (పుల్లట చలపతి) వయోభారంతో పరమపదించడం సాహిత్య లోకానికి తీరని లోటని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈయన సొంత ఊరు శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం బైరిపురం కాగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారని అప్పలనాయుడు తెలిపారు. శ్రీపతి మంచుపల్లకి-మరి తొమ్మిది, సత్యజిత్ రాయ్ ఎవరు, బెనారస్ చిత్రాలు వంటి కథా సంపుటాలు వెలువరించారు. కాటుక కళ్లు-కథలు మూడు ఆయన చివరి కథా సంపుటం. తన గ్రామం నేపథ్యంగా శ్రీపతి రాసిన మామిడి పళ్ల ఊరు ఆయన చివరి కథ.

'ఉత్తమ ఫలితాలు సాధించాలి'



కొత్తూరులోని ఏకలవ్య పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ కల్పన కుమారి

కొత్తూరు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సమాయత్తం చేయాలని ఉపాధ్యాయులకు ఐటీడీఏ పీఓ కల్పనకుమారి తెలిపారు. కొత్తూరులో నిర్వహిస్తున్న ఏకలవ్య పాఠశాలను గురువారం పీఓ సందర్శించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులకు తెలిపారు. రివిజన్ చేయించాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధన కోసం మరింతగా కృషి చేయాలని ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్‌కు పీఓ సూచించారు.

'ప్రాణం విలువ గుర్తించాలి'



చంద్రశేఖర్‌రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: వాహన చోదకులు ప్రాణం విలువ గుర్తించాలని శ్రీకాకుళం డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎ.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో రోడ్డు భద్రతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్ అని వివరించారు. యువత ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం పిల్లలకు అడిగిన వెంటనే అధునాతన బైక్‌లు కొనివ్వటం కంటే డ్రైవింగ్‌పై అవగాహన, లైసెన్స్ తీసుకోవటం వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఆర్.అనిల్, పి.వి.గంగాధర్, ప్రిన్సిపాల్ వీకే చక్రవర్తి పాల్గొన్నారు.

బీఎస్‌ఎఫ్ జవాన్‌కు అశ్రు నివాళి



గాల్లో కాల్పులు జరిపి గౌరవ వందనం అందజేస్తున్న జవాన్లు

టెక్కలి రూరల్: టెక్కలి మండలం గూడేం గ్రామానికి చెందిన పిట్ట రాము అనే బీఎస్ఎఫ్ జవాను రైలు కింద పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన పార్థివ దేహాన్ని గురువారం సాయంత్రం ప్రత్యేక వాహనంలో బీఎస్ఎఫ్ జవాన్‌లు టెక్కలి సమీపంలోకి తీసుకురాగా.. అప్పటికే అక్కడకు చేరుకున్న జనాలను మృతదేహాన్ని ఊరేగింపుగా గ్రామం వరకు తరలించారు. అనంతరం బీఎస్ఎఫ్ జవాన్లు మృతదేహంపై జాతీయ జెండాను కప్పి నివాళులర్పించారు. తర్వాత అధికార లాంఛనాల తో అంత్యక్రియలు నిర్వహించారు.

ఎలుగుల సంచారంపై అప్రమత్తం

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం, తీర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఎలుగులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ్గ డివిజన్ ఫారెస్ట్ రేంజర్ మురళీ కృష్ణం నాయుడు అన్నారు. మండలంలో గల కొండపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాల ఆవరణంతో పాటు గ్రామ పరిసరా ల్లో బుధవారం ఎలుగు సంచరించి హడలెత్తించింది. ఈ మేరకు అటవీశాఖాధికారులు ఎలుగు సంచార ప్రాంతంలో గురువారం పర్యటించి చిన్నారులు, ఉపాధ్యాయులు, ప్రజలతో మాట్లాడారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఎలుగు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించిందని, ఆ సమయంలో ఆరుబయట చిన్నారులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఫారెస్ట్ అధికారులు హామీ ఇచ్చారు. ఎలుగుల సంచారంపై అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరమని అటవీ శాఖాధికారులు అన్నారు. ఎలుగులు కనిపిస్తే తమకు వెంటనే సమాచా రం అందించాలని అన్నారు. అలాగే అక్కుపల్లి, బాతుపురం తదితర గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జీడి తోటలకు వెళ్లేటప్పుడు ఒంటరిగా వెళ్లరాదని సూచించారు. ఈ పర్యటనలో ఫారెస్ట్ అధికారులు రెడ్డి, రాజు, పోలయ్య, సంతోష్, సిబ్బంది ఉన్నారు.

నేడు రథసప్తమి సమన్వయ సమావేశం

అరసవల్లి: రథసప్తమి మహోత్సవానికి సంబంధించి అరసవల్లిలో చేపడుతున్న దర్శన ఏర్పా ట్లు తదితర సౌకర్యాల కల్పనపై శుక్రవారం ఉదయం 10 గంటలకు అనివెట్టి మండపంలో ప్రత్యేక సమన్వయ సమావేశం జరుగుతుందని ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్ బాబు తెలియజే సారు. శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య ఆధ్వర్యంలో మున్సిపల్, పోలీస్, వైద్యం, రెవె న్యూ, విద్యుత్, ఫైర్, మత్స్యశాఖ, దేవదాయ శాఖలతో పాటు పలు ముఖ్య ప్రభుత్వ శాఖాధికారులతో కలిసి పలు అంశాలు, ఏర్పాట్లపై సూచనలు, సలహాలతో సమన్వయపర్చుకునే లా సమావేశం ఉంటుందని ఆయన తెలియజేశారు. తప్పనిసరిగా అనుబంధ ప్రభుత్వ శాఖా ధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

వయో వృద్ధుల తీర్థయాత్ర ప్రారంభం



టిక్కెట్లు ఆవిష్కరిస్తున్న మంత్రి అశ్వినీ కుమార్ పాత్రో

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ వయో వృద్ధ నాగరిక తీర్థయాత్ర యోజన కింద (బీఎన్‌టీవైవై) 28వ విడత యాత్ర గురువారం ప్రారంభమైంది. రాష్ట్ర పర్యటన శాఖ మంత్రి అశ్వినీ కుమార్ పాత్రో ఈ యాత్రని స్థానిక రైల్వేస్టేషన్ నుంచి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభమైన వయో వృద్ధ నాగరిక తీర్థయాత్ర యోజన (బీఎన్‌టీవైవై) నిరవధికంగా కొనసాగుతోంది. వరుసగా ఇది 28వ పర్యటన కావడం విశేషం. ఈ విడతలో ఖుర్దా, కటక్, పూరీ, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, ఢెంకనాల్ జిల్లాల నుంచి సమగ్రంగా 1,000 మంది యాత్రకు బయల్దేరారు. వీరిలో 960 మంది యాత్రికులు, 40 మంది ఎస్కార్ట్ అధికారులు ఉన్నారు. ఈ విడతలో తిరుపతి, వేళ్లూరు ప్రాంతాలను సందర్శిస్తారు. రాష్ట్రంలోని నిరుపేదలు, అణగారిన వృద్ధులు రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో వారి ఆధ్యాత్మిక ఆకాంక్షలను నెరవేర్చడానికి ఒక తీర్థయాత్ర (తీర్థయాత్ర) చేయాలనే వారి జీవితకాల కలను సాకారం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు ఈ యోజన కింద ఇటువంటి 27 యాత్రలు నిర్వహించారు. రాష్ట్రంలో 60 నుంచి 75 సంవత్సరాల వయస్సు గల 26,669 మంది వయో వృద్ధులు ఎస్కార్ట్ అధికారుల సహాయంతో తీర్థయాత్ర ప్రయోజనం పొందారు. 28వ విడతతో సమగ్రంగా 27,669 మంది యాత్రికులు ఈ పథకాన్ని వినియోగించుకున్నట్లు మంత్రి తెలిపారు. భువనేశ్వర్‌లో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర ఉక్కు, గనుల శాఖ మంత్రి ప్రఫుల్ల కుమార్ మల్లిక్, రాష్ట్ర పర్యటన అభివృద్ధి కార్పొరేషను చైర్మన్ లెనిన్ మహంతి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



రైలుకు పచ్చజెండా ఊపుతున్న మంత్రి



తీర్థ యాత్రకు బారులుతీరిన వయో వృద్ధులు

అరసవల్లి ఆలయ ఈఓగా రమేష్‌బాబు



రమేష్‌బాబును అభినందిస్తున్న పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ప్రధానార్చకులు శంకరశర్మ

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న రమేష్‌బాబుకు డీసీగా పదోన్నతి కల్పించి తొలి పోస్టింగ్ అరసవల్లిలో ఇచ్చారు. అరసవల్లిలో ఈఓగా పనిచేసిన వి.హరిసూర్యప్రకాష్‌ను నిడదవోలు (తిమ్మరాజుపాలెం) కోట సత్తెమ్మ ఆలయ ఈఓగా బదిలీ చేసినట్లుగా సమాచారం. కొత్త ఈఓ రమేష్‌బాబుకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ఎస్.కోటేశ్వర చౌదరి, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, జలగడుగుల శ్రీనివాస్‌లు గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి, అనంతరం ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. వీరితో పాటు విజయనగరం జిల్లా పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ సుధారాణి, స్థానిక జిల్లా దేవదాయ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్‌పట్నాయక్ తదితరులు కూడా కొత్త ఈఓను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

తొలి డిప్యూటీ కమిషనర్‌గా..

వార్షికాదాయం ప్రామాణికంగా ఇంతవరకు అసిస్టెంట్ కమిషనర్ హోదాతో ఉన్న అరసవల్లి శ్రీసూర్యదేవాలయాన్ని డిప్యూటీ కమిషనర్ హోదా ఆలయంగా ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు అరసవల్లి ఆలయంలో తగిన క్యాడర్ స్ట్రెంత్‌ను కేటాయించడంతో పాటు డిప్యూటీ కమిషనర్ హోదా అధికారిని కూడా నియమించారు. దీంతో విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లాల్లో తొలి డిప్యూటీ కమిషనర్ హోదా ఆలయంగా అరసవల్లికి గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని, 16న జరగనున్న రథ సప్తమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపడతానని తెలిపారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



పాఠశాలలో ఏర్పాటు చేసి ఫొటో గ్యాలరీని పరిశీలిస్తున్న ఆర్‌జెడీ, డీఈఓలు

సారవకోట: టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారి తెలిపారు. మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని, ఫొటో గ్యాలరీని ఆమె గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది రాష్ట్రంలో 10వ తరగతి ఫలితాల్లో మొదటి 7 స్థానాలకు గాను 6 స్థానాల్లో విశాఖపట్నం జోన్ విద్యార్థులే ఉన్నారని, ఈ ఏడాది అంతకు మించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీని కోసం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారు పరీక్షల్లో పాసయ్యేందుకు వీలుగా తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే 44 వేల మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ ఏడాది 28,982 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని, వీరి కోసం 145 పరీక్ష కేంద్రాలను కేటాయించినట్లు ఆమె తెలిపారు. బుడితి ఉన్నత పాఠశాలలో జిల్లాలో ఎక్కడా లేని విధంగా 2014 నుంచి ఈ పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయునిగా పని చేస్తున్న జి.రవికుమార్ విద్యార్థులు వేసిన పలు రకాల పెయింటింగ్‌లను గ్యాలరీలా ఏర్పాటు చేసి దానికి ఓ గదిని కేటాయించడం గొప్ప విషయమన్నారు. ఆమెతో పాటు డీఈఓ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓ విజయకుమారి, డైట్ లెక్చరర్ జి.రవికుమార్, ఎంఈఓ భూలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు బి.మాధవరావు, ఉపాధ్యాయులు యోగేశ్వరరావు, చిత్రలేఖన ఉపాధ్యాయులు రవికుమార్ తదితరులున్నారు.

అంబాజీపేట.. సందడి



ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న చిత్ర యూనిట్

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలో 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్' చిత్ర యూనిట్ గురువారం సందడి చేసింది. హీరో సుహాస్, హీరోయిన్ శివాని, దర్శకుడు దుష్యంత్ కాటికనేని తదితరులు ఎస్‌వీసీ థియేటర్‌కు గురువారం సాయంత్రం విచ్చేసి సందడి చేశారు. ఈ చిత్ర యూనిట్‌కు థియేటర్ మేనేజర్ రవి స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. చిత్ర హీరో సుహాస్, హీరోయిన్ శివానిలు ప్రేక్షకులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిత్ర హీరో సుహాస్ మాట్లాడుతూ మంచి కథ ఉన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి రుజువు చేశారన్నారు. ఏజెంట్ సాయి చిత్రం నుంచి అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్ చిత్రం వరకూ తన చిత్రాలను ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారన్నారు. దర్శకుడు దుష్యంత్ కాటికనేని మాట్లాడుతూ సినిమాను ఆదరించి విజయవంతం చేసినందుకు ప్రేక్షకులకు రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో చిత్ర విలన్ నితిన్, చిత్ర యూనిట్ సభ్యులు శరణ్య తదితరులు ఉన్నారు.



ప్రేక్షకులతో సెల్ఫీ దిగుతున్న హీరో సుహాస్

క్లుప్తంగా

జూదరుల అరెస్టు

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలస సమీపంలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్టు ఎస్ భూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి గ్రామ సమీపంలో ఉన్న తోటలో పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని వారి నుంచి రూ.3050 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: మండలంలోని అలజంగి కోనేరు గట్టు వద్ద జరుగుతున్న పేకాట శిబిరంపై దాడి చేసి 11 మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ జి.లోవరాజు గురువారం తెలిపారు. వారి నుంచి రూ.30,380లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


రైలు పట్టాలపై శంకరరావు మృతదేహం

పార్వతీపురం టౌన్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మరిపివలస, గుచ్చిమి రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. పార్వతీపురం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వే ట్రాక్‌పైన గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికులు తెలిపిన వివరాల మేరకు సంఘటన స్థలానికి చేరుకున్నామని తెలిపారు. రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు ఢీకొని సీతానగరం మండలం పాపమ్మవలస గ్రామానికి చెందిన బూర్లె శంకరరావు(33) మృతి చెందినట్టు గుర్తించామని తెలిపారు. ఈ ఘటనపై రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సి.రత్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు ఆయన తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


ఆళ్ల కన్నారావు(ఫైల్)

భోగాపురం: మండల కేంద్రం భోగాపురంలో గురువారం ఆళ్ల కన్నారావు (55) మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. కన్నారావు కొనేళ్లుగా ఇటుకల వ్యాపారం చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కాలంలో వ్యాపారం బాగా సాగకపోవడంతో కలిగిన ఆర్థిక ఇబ్బందులు వల్ల సతమతం అవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తన ఇద్దరు పిల్లలను తీసుకుని బైక్‌పై స్కూల్‌కు బయలుదేరాడు. మార్గం మధ్యలో పురుగుల మందు దుకాణం వద్దకు వెళ్లి పురుగుల మందును కొనుగోలు చేసి ఇద్దరు పిల్లలను స్కూల్‌లో దింపి పక్కనే ఉన్న కనకదుర్గమ్మ ఆలయ సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇది గమనించిన స్కూల్ యాజమాన్యం స్పందిస్తూ వెంటనే వాళ్ల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్కూల్ సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే విజయనగరం తిరు మల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు భార్య ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

పట్టణ పేదలకు 'ఆరోగ్య రక్ష'

ప్రజారోగ్యమే మహాభాగ్యంగా భావిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి తొలి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రజల చెంతకే సేవలు చేరవేస్తున్నారు. పట్టణ పేదలకు మరింత ఆరోగ్యం అందేలా పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.


పాలకొండలో నిర్మాణం పూర్తి చేసుకున్న అర్బన్ హెల్త్ సెంటర్

- అందుబాటులోకి వస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రాలు
- శాశ్వత భవనాల నిర్మాణం
- జిల్లాలో ఐదు చోట్ల భవనాల ఏర్పాటు
- ఒక్కో భవనానికి రూ.80లక్షలు

పాలకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తుంది. ఇందులో భాగంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం ద్వారా ఫ్యామిలీ డాక్టర్‌ను అందించారు. ఇదే తరహాలో పట్టణాల్లో ఉన్న పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు అర్బన్ హెల్త్ సెంటర్లు అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటి ద్వారా త్వరితగతిన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కల్పించారు.

నాణ్యమైన సేవలు

పట్టణాల్లో జనాభా ప్రాతిపదికన అర్బన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకువచ్చారు. అత్యాధునిక, నాణ్యమైన వైద్యం అందించేందుకు ఈ క్లినిక్‌లు దోహద పడుతున్నాయి. వైద్య పరంగా ప్రజలకు ఏ చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చిన పెద్దాసుపత్రికి వెళ్లకుండానే వైద్యం అందుతుంది. గత టీడీపీ పాలనలో ప్రభుత్వం వైద్యం అంతంత మాత్రంగానే ఉండేది. చిన్నపాటి ఆరోగ్య సమస్య

జిల్లాలో అర్బన్ హెల్త్ సెంటర్ల వివరాలు		
పట్టణం	కేంద్రాలు	పూర్తి చేసినవి
పాలకొండ	1	1
పార్వతీపురం	2	2
సాలూరు	2	1

తలెత్తిన దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం చర్యలు తీసుకున్నారు. విలేజ్, అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటుతో పాటు నాడు – నేడులో ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతో పాటు 108, 104 సేవలను బలోపేతం చేశారు. ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, ఫ్యామిలీ ఫిజిషియన్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

అందుబాటులో వైద్యులు

డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా సేవలు అందుతున్నాయి. ప్రధానంగా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉంటున్నారు. అక్కడే అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరం ఉంటే పెద్ద ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో 10 పడకలతో ఇన్‌పేషెంట్ల విభాగం, 68 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులు హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉంచారు.

కేంద్రాలకు శాశ్వత భవనాలు

అర్బన్ హెల్త్ సెంటర్ల కోసం ప్రభుత్వం శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టింది. ఇందు కోసం ఒక్కో భవనానికి రూ.80లక్షలు నిధులు అందించింది. జిల్లాలో ఐదు చోట్ల భవనాలు మంజూరు చేయగా ఇప్పటికే నాలుగు భవనాలు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. పాలకొండ, పార్వతీపురం, సాలూరు ప్రాంతాల్లో ప్రస్తుతం భవనాలు సిద్ధం చేశారు.

పట్టణ ప్రజలకు ప్రయోజనం..



రాష్ట్ర ప్రభుత్వం వైద్యసేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. అవసరమైన వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు అన్ని రకాల మందులు అందుబాటులోకి తీసుకువచ్చింది. చిన్నపాటి వైద్యం కోసం కూడా పెద్ద ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సేవలు అందిస్తుంది. ప్రస్తుతం సొంత భవనాలు కూడా అందుబాటులోకి రావడంతో పట్టణ పేదలకు మెరుగైన వైద్యం అందుతుంది. – బగాది జగన్నాథరావు, డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం జిల్లా

పారాది కాజ్‌వే ట్రయల్ రన్


పారాది కాజ్‌వే గుండా భారీ వాహనాలు వెళ్తున్న దృశ్యం

- 65–70 టన్నుల బరువున్న వాహనాలను నడిపించిన అధికారులు

బొబ్బిలి: పారాది వద్ద వేగావతి నదిపై కొత్తగా నిర్మించిన కాజ్‌వేపై ట్రయల్ రన్‌గా భారీ వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతించారు. మూడు రోజులుగా 65 నుంచి 70 టన్నుల బరువున్న వాహనాలను విడిచిపెట్టారు. గ్రోత్ సెంటర్‌లోని బెర్రీ కంపెనీకి సరుకులను రవాణా చేసే వాహనాలు కాజ్‌వేపై నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. కాజ్‌వే ఇప్పటివరకు ఎక్కగా కుంగలేదు. మరో మూడు రోజులు ట్రయల్ రన్ నిర్వహించాక తారురోడ్డు వేసి పూర్తిస్థాయిలో భారీ వాహనాలన్నింటినీ అనుమతిస్తామని అధికారులు స్పష్టంచేశారు. అంతర్‌రాష్ట్ర రహదారిలో పారాది వద్ద వేగావతి నదిపై ఉన్న పాత వంతెన మరమ్మతులకు గురవడంతో వాహనాలను రాజాం, ఆకులకట్ట, తెర్లాం మీదుగా మళ్లిస్తున్న సంగతి తెలిసిందే. రూ.10.90 కోట్లతో కొత్త వంతెన నిర్మించేందుకు కాజ్‌వే, అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. రూ.94 లక్షలతో నిర్మించిన రోడ్డు త్వరగానే పూర్తి చేసింది. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు రాష్ట్రప్రభుత్వం దృష్టికి వంతెన సమస్యను తీసుకువెళ్లడం, వెంటనే అనుమతులు, నిధులు మంజూరు కావడంతో పనులను అధికారులు, కాంట్రాక్టర్లు చేపట్టి త్వరితగతిన పూర్తి చేశారు.

భయపెట్టి.. చితక్కొట్టిన వ్యక్తుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు వ్యక్తులను మద్యం సేవించిన ముగ్గురు వ్యక్తులు భయపెట్టి, చితక్కొట్టి, వారి నుంచి డబ్బులు గుంజుకుని పరారైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు గురువారం అందించిన వివరాలిలా ఉన్నాయి. కెఎల్.పురంలో నివాసం ఉంటున్న జి.గౌరునాయుడు జియో టవర్స్ నెట్‌వర్క్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం కెఎల్.పురం సమీపంలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ వద్దనున్న సెల్ టవర్‌లో జనరేటర్ సర్వర్ డౌన్ కావడంతో దాన్ని రిపేర్ చేసేందుకు నాయుడు మరో ఇద్దరు టెక్నీషియన్లతో కలిసి వచ్చి పని చేస్తున్నారు. ఇంతలో బార్‌లో నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు పనిచేస్తున్న వారి వద్దకు వచ్చి భయభ్రాంతులకు గురిచేసి వారిని బలంగా కొట్టారు. అనంతరం వారి నుంచి రూ.600 నగదు, ఫోన్ పే ద్వారా బార్‌లో వారు సేవించిన మద్యానికి అయిన ఖర్చు రూ. 2వేల 500లను టెక్నీషియన్ ఫోన్ ద్వారా పంపించారు. అనంతరం చంపేస్తామని బెదిరించి పరారయ్యారు. బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయాలతో ఉన్న వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. కేసును తీవ్రంగా పరిగణించిన పోలీసులు సీసీ ఫుటేజ్‌ల ద్వారా వారిని గెంజిపేటకు చెందిన వ్యక్తులుగా గుర్తించి, అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

25 కిలోల గంజాయి స్వాధీనం


పట్టుబడ్డ గంజాయి, నిందితులతో ఎస్.కోట పోలీసులు

శృంగవరపుకోట: వాహన తనిఖీలు చేస్తున్న ఎస్.కోట పోలీసులు గురువారం ఎస్.కోట పట్టణంలో దేవీ జంక్షన్ వద్ద ఉదయం 9గంటల సమయంలో అక్రమంగా తరలిస్తున్న 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరుకు నుంచి వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా ఆటోలో వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఒడిశా ప్రాంతం నుంచి 21కిలోల గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. ఎస్.ఐ ఎ.మోహన్‌రావు కేసు నమోదు చేశారని, పట్టుబడ్డ వ్యక్తుల్ని అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరిచి, రిమాండ్‌కు తరలిస్తామని సీఐ వై.మురళీరావు తెలిపారు.

ఆరోగ్యకర శిశువులు

- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ చర్యలు
- గర్భిణులకు నెలనెలా ఆరోగ్య పరీక్షలు
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇంటికే పౌష్టికాహారం పంపిణీ
- ఎప్పటికప్పుడు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన
- ఆరోగ్యంగా జన్మిస్తున్న శిశువులు
- 2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 15,995 మంది శిశువుల జననం
- వీరిలో కేవలం 280 మంది మాత్రమే 2.5 కేజీల కంటే తక్కువ బరువు


ఘోష ఆస్పత్రిలో జన్మనిచ్చిన శిశువులతో తల్లులు

విజయనగరం ఫోర్ట్:

మాతాశిశు సంరక్షణ, సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. మహిళలు గర్భందాల్చిన నుంచి నెలనెలా వైద్యపరీక్షలు చేయడం, ఆరోగ్య జాగ్రత్తలు వివరించడం, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం సరఫరా చేయడం, రక్తహీనతతో బాధపడేవారికి ముందస్తుగానే వైద్యం చేయడం, ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంల సాయంతో సకాలంలో ప్రభుత్వాస్పత్రులకు తరలించి సుఖప్రసవం చేయడం వంటి చర్యలతో మాతాశిశు మరణాలు తగ్గాయి. ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తుండడంతో వైద్యవర్గాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

15,995 మంది శిశువుల జననం

విజయనగరం జిల్లాలో 2023 ఏప్రిల్ నెల నుంచి డిసెంబర్ నెలఖారు నాటికి 15,995 మంది శిశువులు జన్మించారు. వీరిలో 2.5 కిలోల కంటే తక్కువ బరువుతో పుట్టిన శిశువులు కేవలం 280 మంది మాత్రమే. వీరు కూడా ఆరోగ్యంగానే ఉన్నారు. మిగిలిన శిశువులందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు. 3 కేజీల నుంచి మూడున్నర కేజీల బరువుతో ఆరోగ్యంగా జన్మిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

మాతాశిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. వారికి అవసరమైన వైద్య తనిఖీలు సకాలంలో చేస్తున్నాం. నెలలు నిండిన తర్వాత సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి సుఖప్రసవానికి చర్యలు తీసుకుంటున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందించడం, వైద్యపరీక్షలు చేయడం, ఉచితంగా మందులు అందించడంతో శిశువులు ఆరోగ్యంగా జన్మిస్తున్నారు. – డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

పౌష్టికాహారం సరఫరా..

గర్భస్థ సమయంలో మహిళలు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. హెచ్‌బీ (హిమోగ్లోబిన్) సరిపడా ఉంటే ప్రసవ సమయంలో ఎటువంటి ఇబ్బంది ఉండదు. అలాగే, బలంగా, ఆరోగ్యంగా ఉండేందుకు మంచి పౌష్టికాహారం తీసుకోవాల్సి ఉంటుంది. దీని కోసం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నెలకు సరిపడా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తోంది. రాగి పిండి, బెల్లం, కర్జూరం, వేరుశనగ చెక్కీలు, గుడ్లు, బియ్యం, నూనె, పాలు సరఫరా చేస్తోంది. ఓ వైపు పౌష్టికాహారం తీసుకుంటూ వైద్యుని సలహా మేరకు మందులు వాడడంతో గర్భంలో శిశువు ఎదుగుదల బాగుంటోంది. అవయవాల సక్రమ ఎదుగుదలతో ఆరోగ్యకర శిశువులు జన్మిస్తున్నారు.

నెలనెలా వైద్యపరీక్షలు

గర్భిణిగా రిజిస్టర్‌లో ఏఎన్ఎం వివరాలు నమోదు చేసిన నుంచి ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రతి గర్భిణికి ప్రసవించేలోగా నాలుగు యాంటినేటల్ చెకప్స్(ఏఎన్‌సీ)ను వైద్యులు నిర్వహిస్తారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి నెలనెలా గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నారు. వైద్యపరీక్షల్లో గర్భిణులకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే దాని నివారణకు అవసరమైన చికిత్స అందిస్తున్నారు.


విజయనగరంలోని తోటపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న అంగన్‌వాడీలు

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..


వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

- కందిశ గ్రామంలో టీడీపీకి షాక్

రేగిడి : మండలంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. మండలంలోని కందిశ గ్రామం నుంచి భారీగా టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో గురువారం చేరారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన సంక్షేమ ప్రచార కార్యక్రమంలో గ్రామానికి చెందిన గంధవరపు సిమ్మయ్య, జామి సూర్యనారాయణ, ఖండాపు సీతంనాయుడు, శాసపు తమ్మినాయుడు, వారాడ సంగంనాయుడు, పైల బాలరాజు తదితర టీడీపీ కార్యకర్తలతో పాటు మరో ముప్పై కుటుంబాల కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ వీరికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరామని వెల్లడించారు. రాజాం నియోజకవర్గంలో టీడీపీకి ఒక దశ, దిశ లేదని, కుమ్ములాటలతో నియోజకవర్గ నాయకులు కాలక్షేపం చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధివిధానాలు, సంక్షేమ పథకాలు అమలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి, క్రమశిక్షణా విధానం, చదువుకున్న యువకులకు రాజకీయ అవకాశం వంటి పరిణామాలతో ఆకర్షితులమై పార్టీలోకి వచ్చామని, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ గెలుపే ధ్యేయంగా పని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్ కెల్ల మన్మధరావు, సంకిలి, రేగిడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధ్యక్షులు వంజరాపు అశోక్‌కుమార్, లావేటి వెంకటవేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికని వెళ్లి.. దేవుడు చెంతకే...

- తిరుపతిలో వీరఘట్టంకు చెందిన వాగ్దేవి మృతి


కెంగువ వాగ్దేవి (ఫైల్)

వీరఘట్టం: తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన వీరఘట్టంకు చెందిన కెంగువ వాగ్దేవి(55) గురువారం ఉదయం మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. వాగ్దేవి ఈ నెల 5న వేంకటేశ్వర స్వామి దర్శనానికి రూ.300ల ప్రత్యేక క్యూలైన్‌లో వెళ్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆమెను తిరుమలలోనే ప్రథమ చికిత్స అందించి, తరువాత తిరుపతిలోని మిమ్స్‌లో చేర్పించారు. వైద్య చికిత్సలు చేసిన వైద్యులు బాగా బీపీ పెరగడంతో పాటు తలలో రక్తం గడ్డకట్టినట్టు గుర్తించారు. బీపీ అదుపులోకి వస్తే ఆపరేషన్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే గురువారం తెల్లవారుజామున ఆస్పత్రిలోనే వాగ్దేవి తుదిశ్వాస విడిచారు. దైవ దర్శనానికి వెళ్లిన వాగ్దేవి ఇలా మృత్యు ఒడిలోకి వెళ్లడంతో వీరఘట్టంలో విషాదచాయలు అలముకున్నాయి. వాగ్దేవి భర్త కెంగువ ఆంజనేయులు వైఎస్సార్‌సీపీ నాయకుడు. దంపతులిద్దరూ కలిసే వెంకన్న స్వామి దర్శనానికి ఈ నెల 4న పార్వతీపురంలో హతియా – యశ్వంత్‌పూర్ రైలులో తిరుపతికి పయనమయ్యారు. ఆ రోజు రైలు మూడు గంటలు ఆలస్యం కావడంతో ఈ నెల 5న అర్ధరాత్రి 1 గంట సమయంలో తిరుపతి చేరుకున్నారు. అక్కడ కొంత సమయం ఉండి తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో తిరుమల కొండపైకి బయలుదేరి వెళ్లారు. కొండపైకి వెళ్లాక రూ.300 ప్రత్యేక దర్శనం కోసం ఇద్దరూ వెళ్తుండగా వాగ్దేవి స్పృహ తప్పి పడిపోయింది. వాగ్దేవి మృతి పట్ల ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు తమ సంతాపం తెలిపారు.

మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై కేసు


లక్కవరపుకోట : మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, నిందితులతో ఎస్ఐ గోపాలరావు

లక్కవరపుకోట: నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై ఎల్.కోట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు.. మండలంలోని లింగంపేట, పూడివానిపాలెం గ్రామాలకు చెందిన సిహెచ్.సన్యాసిరావు, ఎస్.అచ్చిబాబు ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తుండగా మాటుకాసి పోలీస్‌లు పట్టుకున్నారు. వీరి నుంచి 180 ఎంఎల్ 41 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కొత్తవలస: మండలంలోని పాతసుంకరపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని సీఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఆయన నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. కర్రిచిన్నయ్యపాలెం సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందాలపై పోలీసులు దాడి చేశారు. నలుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకొని రూ.10,750 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నైపుణ్యంతో ఉపాధి



స్కిల్ కాలేజీ అభ్యర్థులతో మాట్లాడుతున్న ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ అజయ్‌రెడ్డి

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ అజయ్‌రెడ్డి

విజయనగరం అర్బన్: విద్యార్హతతో పాటు నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం వల్ల ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన జిల్లా కేంద్రంలో ఉన్న టీటీడీసీలోని స్కిల్‌కాలేజీ, సెంచూరియన్ యూనివర్సిటీలో ఉన్న నైపుణ్య శిక్షణ కేంద్రాలను గురువారం సందర్శించారు. శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడారు. నైపుణ్య శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. నేర్చుకున్న శిక్షణతో ఏ స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న దానిపై అభ్యర్థుల అవగాహన సామర్థ్యాలను పరీక్షించారు. శిక్షణ అనంతరం లభించే అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఉద్యోగంలో మరింత నైపుణ్యతతో ఉన్నతంగా జీవించవచ్చన్నారు. దూరప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేందుకు మానసికంగా సిద్ధం కావాలని సూచించారు. రాష్ట్రంలోని యువత నైపుణ్య సంస్థ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమన్నారు. కార్యక్రమంలో సీడప్ సీఈఓ ఎంకేవీ శ్రీనివాసులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు, జిల్లా సీడప్ జేడీ ఎం.మార్టిన్‌లూథర్, సెంచూరియన్ యూనివర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ మురళి, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా

విజయనగరం అర్బన్: వివిధ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం శుక్రవారం స్థానిక బీసీ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్ట్రాటెక్ సిమెంట్, పేడీయం స్మార్ట్ సర్వీసెస్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ జరుగుతుందన్నారు. ఆల్ట్రాటెక్ కంపెనీలో టెక్నికల్, అప్లికేషన్ ఇంజినీర్స్–06, పేటీఎం కంపెనీలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్–100 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. పురుష అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా 'ఎన్‌సీఎస్.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో జాబ్‌సీకర్స్ లాగిన్‌లో నమోదు చేసుకొని ఆ రోజు ఉదయం 10 గంటలకు ఎంపిక ప్రాంగణానికి హాజరుకావాలని, పూర్తి వివరాల కోసం సెల్: 89193 78915 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.